క్లుప్తంగా

కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి



విద్యార్థులకు అడ్మిషన్లు అందజేస్తున్న వంశీధర్‌రావు

నంగునూరు(సిద్దిపేట): యువతీ యువకులు, మహిళలు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు అన్నారు. కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంగునూరులో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం వంశీధర్‌రావు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల ప్రజలకు సాయం చేయాలనే సంకల్పంతో శిక్షణ శిబిరాలను నెలకొల్పడంతో పాటు 13 అంబలి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు 60 మందికి శిక్షణ ఇవ్వడంతో పాటు నిరంతరాయంగా కేంద్రాన్ని నిర్వహిస్తామని చెప్పారు. త్వరలోనే ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభించి మహిళలకు అండగా నిలుస్తామన్నారు.

రాయపోల్ తహసీల్దార్‌గా ఉమారాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఉమారాణి

దుబ్బాక: రాయపోల్ మండలం నూతన తహసీల్దార్‌గా ఉమారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాగా రాయపోల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సహదేవ్ సిద్దిపేట కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యాడు. ఉమారాణి నారాయణరావుపేట మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై రాయపోల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

రెగ్యులర్ అయ్యేవరకు పోరాటం

14వ రోజుకు చేరిన జేపీఎస్‌ల సమ్మె



సమ్మె చేస్తున్న జేపీఎస్‌లు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌లో తెలిపిన విధంగా 4 సంవత్సరాల ప్రొబేషన్ పూర్తి చేసుకున్న జేపీఎస్, ఓపీఎస్‌లను రెగ్యులర్ చేసేంతవరకు విధుల్లోకి చేరేది లేదని జేపీఎస్ జేఏసీ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. రెగ్యులర్ చేయాలని కోరుతూ జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేస్తున్నట్లు జీఓ విడుదల చేసేంతవరకు విధుల్లోకి చేరమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు ప్రభుత్వంపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. తమకు మద్దతు తెలిపిన హైకోర్టు అడ్వకేట్ శరత్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు



ఎస్‌ఐకి ఫిర్యాదు ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు, గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో ఉన్న 11వ శతాబ్దపు పురాతన ఆలయం లక్ష్మీనారాయణస్వామి, శంభూరీశ్వరస్వామి ఆలయాలకు వెళ్లే దారిని అక్రమంగా కబ్జా చేసి దున్నిన వారిపై చర్యలు తీసుకొని దారిని పునరుద్ధరించేలా చేయాలంటూ గురువారం వీహెచ్‌పీ నాయకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆలయానికి సంబంధించిన 42 ఎకరాల భూమి అన్యాక్రాంతమైనా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆలయానికి భక్తులు వెళ్లి పూజలు చేయడానికి వీలు లేకుండా దారిని కబ్జాచేసి ట్రాక్టర్లతో దుక్కి దున్నిన వారిపై చర్యలు తీసుకొని దారిని పునరుద్ధరించాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామస్తులు సాంబయ్య, నర్సింలు, అశోక్, స్వామి, సత్యనారాయణ, బాల్‌రెడ్డి, సాయిశంకర్, వీహెచ్‌పీ నాయకులు లక్ష్మణ్, నర్సింహారెడ్డి, సంపత్, మహేందర్‌రెడ్డి, పాండు, ఉదయ్‌రెడ్డిలు ఉన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో తిగుల్, మునిగడప గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలేషంగౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, సర్పంచ్‌లు భానుప్రకాశ్‌రావు, బాల్‌లక్ష్మి, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఏఓ వసంతరావు, ఏపీఎం ఆనంద్ నాయకులు పాల్గొన్నారు.

మర్కూక్(గజ్వేల్): మండలంలోని శివారువెంకటాపూర్, ఎర్రవల్లి, అంగడికిష్టాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, సర్పంచ్‌లు భాగ్యభిక్షపతి, లక్ష్మీరాములుగౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు ధనలక్ష్మి, కనకమ్మ, నరేందర్, ఏపీఎం ఆనంద్, ఏఓ నాగేందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.



తిగుల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొండం వనిత అన్నారు. గురువారం చిన్నకోడూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, ఎంపీటీసీలు శ్రీనివాస్, శారద రమేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కాశగుడిసెలు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సర్పంచ్ షేక్ ఫకీర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో రాములు, ఉపసర్పంచ్ చాంద్‌బీ, వార్డుసభ్యులు అక్బర్, నజీరా, ఆదంబి, కో–ఆప్షన్ సభ్యులు సుభాన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరులో..

కొనసాగుతున్న వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు

వర్గల్(గజ్వేల్): భక్తజనావళికి ఆధ్యాత్మిక అనుభూతులు పంచుతున్న వర్గల్ వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవాలు శిఖరాగ్రానికి చేరాయి. ఉత్సవాల్లో కీలకమైన విమాన రథోత్సవం పురవీధుల్లో రుక్మిణి, సత్యభామ సమేతులై స్వామివారు దివ్య విమాన రథంపై పురవీధుల్లోవిహరించే అద్వితీయ ఘట్టం శుక్రవారం ఆవిష్కృతం కానున్నది. తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయ మండపం వద్ద విమాన రథ ప్రతిష్ఠ, బలిహరణాది కార్యక్రమాలు జరుగుతాయి. 7 గంటలకు విమాన రథోత్సవ ఊరేగింపు ప్రారంభమవుతుంది. ఊరేగింపునకు అనుగుణంగా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. కాగా ఉత్సవాల్లో భాగంగా గురువారం మూలవిరాట్‌లకు విశేషాభిషేకం, అలంకార సేవ, సుదర్శన హోమం నిర్వహించారు.



ఆలయంలో మూలవిరాట్‌లు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శనిగరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలు పడుతున్న క్రమంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో రెండు వేయింగ్ ఎలక్ట్రానిక్ మిషన్లు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. కేంద్రంలో 8 వేల గన్నీ బ్యాగుల వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని రైతులను ఇబ్బంది పెట్టకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. రోజుకు కనీసం 8 లారీల ధాన్యం మిల్లుకు పంపించాలని ఆదేశించారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే విమర్శలు

గజ్వేల్: రైతుబంధు పథకం వ్యవసాయ రంగంలో గొప్ప పరివర్తనకు బాటలు వేసిందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గురువారం గజ్వేల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఈ గొప్ప పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ పథకం నేటికీ అయిదేళ్లు పూర్తి చేసుకోవడం హర్షణీయమన్నారు. కేసీఆర్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ జీర్ణించుకోలేక తప్పుడు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ తీరు మార్చుకోకపోతే కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, డైరెక్టర్ ప్రవీణ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

కొండపాక(గజ్వేల్): మండలంలోని రవీంద్రనగర్‌లో ఈనెల 12వ తేదీ శుక్రవారం నుంచి 14 ఆదివారం వరకు భక్తాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ, నవగ్రహ, బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వెలికట్ట గ్రామ పంచాయతీ పరిధి నుంచి రవీంద్రనగర్ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. దీంతో గ్రామంలో దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను బ్రాహ్మణోత్తముల మంత్రోచ్చారణలతో వైభవంగా నిర్వహిస్తామన్నారు.

రోజువారీ కార్యక్రమాలు

12వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు గణపతి పూజ, స్వస్తిహవచనం, స్థాపితా దేవతా పూజ, ఆదివాసాంగ హోమాలు, మంత్ర పుష్పం, జలాధివాసం, తీర్థ ప్రసాద వితరణ,13వ తేదీ శనివారం స్థాపితా దేవతా పూజ, మూలమంత్ర హవనము, మంత్ర పుష్పం, సాయం ప్రదోశపూజా ఫలం, శయ్యాదివాసం, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 14వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు స్థాపితా దేవతా పూజ, గర్తన్యాసము, 9:24 గంటలకు శతభిషానక్షత్రయుక్త మిథున లగ్న శుభ ముహూర్తమున బ్రహ్మశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి సమక్షంలో యంత్ర ప్రతిష్ఠ, నవగ్రహ సహిత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ, శాంతి పౌష్టిక హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి అన్నదాన వితరణ జరుగుతుందని తెలిపారు. మూడురోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే ప్రతిష్ఠోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ వాసరి లింగారావు కోరారు.



ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం

దివ్యాంగులకు స్కూటీలు అందజేత



స్కూటీలు అందిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలోని దివ్యాంగులందరికీ గురువారం ఎంపీ ప్రభాకర్‌రెడ్డి తన సొంత నిధులతో పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో స్కూటీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన దివ్యాంగులు ఇంకా మిగిలిపోతే వారికి కూడా అందిస్తామన్నారు. అదే విధంగాపదిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఆయన సన్మానించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, ఎంఈఓ ప్రభుదాస్ ఉన్నారు.

జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతం



బాణసంచా కాల్చుతున్న నాయకులు

సిద్దిపేటజోన్: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పర్యవేక్షణలో సిద్దిపేట జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతమైందని బీఆర్‌ఎస్వీ నాయకులు శ్యామ్ మహిపాల్‌గౌడ్ అన్నాడు. పదో తరగతి ఫలితాల్లో సిద్దిపేట రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడంపై గురువారం విద్యార్థి నాయకులు మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద బాణాసంచాలు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. విద్యార్థులకు నిరంతరం సూచనలు, వసతులు కల్పించి ఉపాధ్యాయులను ఎప్పటికప్పుడూ అప్రమత్తంగా చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నరేశ్, రాజు, మధు, బాలు, అశోక్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రంలోని సంకట విమోచన హనుమాన్ ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో గురువారం ఉదయం శాంతి మంత్ర పఠనం, మండప దేవతపూజ హవనం, మహాస్నాపనం, ప్రసాది సంస్కారం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ ప్రదోషకాల పూజ, పుష్పాది హోసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

‘మానవహారం’ విజయవంతం చేయండి

చేర్యాల(సిద్దిపేట): ఇంటి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న పట్టణ కేంద్రంలోని అంగడిబజార్ వద్ద గల అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించే మానవహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని వాసవి గార్డెన్‌లో జరిగిన జేఏసీ, అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో పట్టణ ప్రజలు ఐదునెలలుగా వినతిపత్రాలు, బంద్‌లు, రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా పాలకవర్గం, ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ మానవహారం కార్యక్రమంతో పాలకవర్గం, ప్రభుత్వం, అధికారులు దిగివచ్చి ఇంటిపన్ను తగ్గించేలా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ, అఖిలపక్ష నాయకులు ఆగంరెడ్డి, మల్లారెడ్డి, నర్సింగరావు, అశోక్, బీరయ్య, యాదయ్య, చిరంజీవులు, నర్సింహారెడ్డి, రాజు, వెంకట్‌మావో, సుదర్శన్, అరుణ్, రంజిత్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరమేశ్వర్

దౌల్తాబాద్ పశువుల సంత వేలం 1.57లక్షలు



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

దుబ్బాక: దౌల్తాబాద్ మండల కేంద్రంలో కూరగాయల సంత, పశువుల సంత నిర్వహణకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. దౌల్తాబాద్ మండల పంచాయతీ అధికారి సయ్యద్‌గఫూర్ ఖాద్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటకు ఆరుగురు పోటీదారులు హాజరయ్యారు. పశువుల సంతను 1.57 లక్షలకు గొల్ల బోరింగ్ ఎల్లయ్య దక్కించుకున్నాడు. అదేవిధంగా కూరగాయల తైబజారుకు ప్రభుత్వం నిర్వహించిన కనీస ధర కంటే తక్కువ పాట పాడడంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు మండల పంచాయతీ అధికారి గఫూర్‌ఖాద్రీ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి సతీశ్ తెలిపారు. వేలం పాట మొదలయ్యే ముందు గ్రామ పంచాయతీ దుకాణ సముదాయాల నుంచి వస్తున్న కిరాయిలు, సంతకు సంబంధించి ఆదాయ వివరాలు వెల్లడించాలని ప్రజలు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి సమ్మెలో ఉండడంతో వివరాలు అందుబాటులో లేవని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి ఉన్నారు.

స్వాములకు పండ్లు పంపిణీ

కొండపాక(గజ్వేల్): హనుమాన్ దీక్షతో అరిష్టాలు తొలగుతాయని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రవీంద్రనగర్ శివారులో రాజీవ్ రహదారి వెంబడి హనుమాన్ దీక్షా విరమణకు ఖాళీ నడకన వెళ్లే స్వాములకు మూడు రకాల పండ్లు, మినరల్ మంచి నీటి బాటిళ్లను గురువారం సాయంత్రం సర్పంచ్ మాధురీరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి తదితరులు

సంక్షిప్త వార్తలు

◆ **హోమియా మందుతో వడదెబ్బ నివారణ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు వడదెబ్బ నివారణ మందు ఎంతో ఉపకరిస్తుందని హోమియా వైద్యుడు కాశీ ప్రసాద్ అన్నారు. గురువారం సిద్దిపేటలోని లయన్స్ భవన్‌లో అభయ జ్యోతి మనో వికాస్ కేంద్రం విద్యార్థులు, సిబ్బంది తల్లిదండ్రులకు వడదెబ్బ నివారణ హోమియా మందును 40 మందికి ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి జోజి నిర్మల, అభయ జ్యోతి సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ **పరామర్శ**

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం ఇందుప్రియల్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో విషయం తెలుసుకున్న చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ముగ్గురు పిల్లలకు అన్ని వసతులు కల్పించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామలకుమార్, ఎంపీటీసీ వీరమ్మ మల్లేశం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ తదితరులున్నారు. వెంకటేశ్ కుటుంబం బీద కుటుంబమే కాక ఆస్తిపాస్తులు సైతం లేవని బాధిత కుటుంబాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు యాదగిరి కోరారు.

◆ **మద్దూరు మండల సమావేశం వాయిదా**

మద్దూరు(హుస్నాబాద్): సమావేశానికి కావలసిన ఫోరం లేక సమావేశం జరగకుండానే వాయిదా పడింది. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఫోరం లేకపోవడంతో సభను వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

◆ **బాధిత కుటుంబానికి పరామర్శ**

దుబ్బాక: దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామానికి చెందిన సోమన్న గారి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామన్నారు.

◆ **వీవోఏల సమస్యలను పరిష్కరించాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): వీవోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల పరిధిలోని వీవోఏలు డిమాండ్ చేశారు. మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వారు ఆందోళన కార్యక్రమం చేపట్టి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఉదయశ్రీకి అందించారు. కార్యక్రమంలో స్వప్న, లావణ్య, శ్యామల, వినోద, శోభ, భూపాల్, సత్తిరెడ్డి, వెంకటలక్ష్మి, కవిత, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం

కొండపాక(గజ్వేల్): అంధత్వ రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, సర్పంచ్‌లు రవీందర్, లావణ్యలతో కలిసి గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింగరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు భాస్కర్, కనకయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌కు తరలిన నాయకులు

వర్గల్(గజ్వేల్): సంగారెడ్డిలో నిర్వహించిన నిరుద్యోగ మార్చ్‌కు గురువారం రాష్ట్ర బీజేపీ నాయకుడు, వర్గల్ మండల ఇన్‌చార్జ్ పూదరి నందన్‌గౌడ్ ఆధ్వర్యంలో మండలం నుంచి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు, నిరుద్యోగులు తరలివెళ్లారు.

‘భూ నిర్వాసితులను ముంచిన ప్రభుత్వం’

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి రిజర్వాయర్ కల్పవల్లి కాదని, అది నిర్వాసితుల కన్నీరు అని వైఎస్సార్‌టీపీ హుస్నాబాద్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిహారం చెల్లించాలంటూ న్యాయపోరాటం చేస్తున్న నిర్వాసితులపై ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కక్షకట్టి పోలీస్ బలగాలతో బలవంతంగా ఇళ్లను ఖాళీ చేయించాలన్నారని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి పుణ్యమా.. ఈ ప్రాంతానికి ఎత్తిపోతల పథకం కింద గౌరవెల్లి రిజర్వాయర్ మంజూరైందన్నారు. అధికారంలో వచ్చిన తెలంగాణ ప్రభుత్వం రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి రైతులను ముంచారన్నారు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించకుండా భూ నిర్వాసితులను నిండా ముంచారని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. ఇంకా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్, ఇళ్లకు పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించక ముందే ఇళ్లను బలవంతంగా ఖాళీ చేయించడం ఏమిటని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో పోరుబాటను కొనసాగిస్తామని హెచ్చరించారు.

క్రీడల నిర్వహణకు స్థల పరిశీలన

మద్దూరు(హుస్నాబాద్): ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడల నిర్వహణకు ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 17 వరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సీఎం కప్ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈక్రీడా ఉత్సవాల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో నర్సింహారెడ్డి, ఎస్‌ఐ నారాయణ, పీటీ భాస్కర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

15 నుంచి సీఎం కప్ క్రీడోత్సవాలు

తొగుట(దుబ్బాక): ఈ నెల 15 నుంచి 17 వరకు సీఎం కప్ క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద తమపేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మండల స్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచివారు జిల్లా స్థాయిలో 22 నుంచి 24 వరకు నిర్వహించే క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడల నిర్వహణ విషయమై ఈ నెల 12న ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనునున్నట్లు ఆయన తెలిపారు.

వర్గల్(గజ్వేల్): సీఎం కప్‌కు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ మేరీస్వర్ణ కుమారి తెలిపారు. ఆసక్తి కలిగినవారు వివరాలకు ఎంపీడీఓ కార్యాలయం లేదా 9652977490, 9949556461 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని నర్మేటలో నిర్వహించే కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో, అథ్లెటిక్ పోటీలో 15 నుంచి 36 సంవత్సరాల వయస్సు వారు అర్హులని ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్ తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కరాటేలో ఏడుగురికి బ్లాక్‌బెల్ట్

వర్గల్(గజ్వేల్): వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు కరాటేలో సత్తా చాటారు. రెండు సంవత్సరాల శిక్షణ అనంతరం గురువారం ఇక్కడి గురుకులంలో నిర్వహించిన కరాటే పోటీలో ఉత్తమ ప్రతిభతో ఏడుగురు బ్లాక్‌బెల్ట్ సాధించారు. కోచ్‌లు సీహెచ్ సాయికుమార్, టీ జనార్ధన్, కే రవి బృందం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ పోటీలో 83 మంది పాల్గొనగా ఎస్ మహేశ్వరి, జే పల్లవి, యమ్ వనిత, బీ శ్యామల, నవనీత, కే శ్వేత, ఎస్ శివలీల చక్కని ప్రదర్శనతో బ్లాక్ బెల్ట్ దక్కించుకున్నారు. మరో 18 మందికి బ్రౌన్ బెల్ట్, 36 మందికి ఆరెంజ్ బెల్ట్, 19 మందికి ఎల్లో బెల్ట్ దక్కింది. ఈ సందర్భంగా వారిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేంకటేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, వరలక్ష్మి, కోచ్‌లు అధ్యాపకులు అభినందించారు.



బ్లాక్‌బెల్ట్ సాధించిన పూలే డిగ్రీ కళాశాల విద్యార్థినులు